# 4

# గయ్యాళి భార్య

అవి ధర్మదేవత నాలుగు పాదాలా నడుస్తున్న రోజులు.

ఆ కాలంలో 'ధర్మపురి' అనే ఒక ఊరుండేది. పేరుకు తగ్గట్లు ఆ ఊరిలోని వారందరూ ధర్మాత్ములే. పరాయి ఊరి వాళ్ళు ఆ ఊరికి వచ్చి ఏ సమయంలో ఏ ఇంటికి వెళ్లినా, అతిథులను సాక్షాత్తూ దేవతలుగా భావించేవారు వారు. వారికి సకలోపకారాలూ చేసి నవకాయ పిండివంటలతో కడుపునిండా కమ్మని భోజనం పెట్టేవారు. అతిథులు తృప్తి చెంది ఆతిథ్యం ఇచ్చిన వారిని మనసారా దీవించి వెళ్లేవారు.

ఆ ధర్మపురిలో 'ప్రభుదాసు' అనే ఆసామీ ఉండేవాడు. అతనికి తాతలు, తండ్రులు సంపాదించిన ఆస్తి ఉంది. దాని మీద వచ్చే ఆదాయంలో అతను అతిథులను ఘనంగా సత్కరిస్తుండేవాడు. అయితే అతనికి వివాహం కాలేదు. భార్య కూడా ఉంటే అతిథి సత్కారాలకు మరింత వీలుగా ఉంటుందన్న ఆలోచన కలిగిందతనికి. పైగా.., అతని ఇల్లు రాచబాట మీద ఉండడంవల్ల ఎంతోమంది అతిథులు వస్తుండేవారు.

ప్రభుదాసుకి వివాహం చేసుకోవాలనే కోరిక తెలుసుకొని ఒక పెళ్ళిళ్ళపేరయ్య ఒక సంబంధాన్ని కుదిర్చాడు.పెళ్ళికూతురు పేరు 'భద్రకాళి.' ఆమె ప్రభుదాసుకి నచ్చింది. ఆడపెళ్ళివారికి కూడా ప్రభుదాసుకి ముందూ వెనకా ఎవరూ లేక పోవడంతోనూ, అతను ధనవంతుడు కావడంవల్లనూ నచ్చాడు. త్వరలోనే వారిద్దరికీ వివాహం అయింది.

భద్రకాళికి భర్త చేసే దానధర్మాలు, అతిథిమర్యాదలూ ఎంతమాత్రం నచ్చలేదు. 'ఇలా అయితే ఎంతకాలం సాగుతుం' దని భర్తని నిగ్గదీసింది . "రేపు పిల్లా పాపా పుట్టే వాళ్ళ గతేంకానూ..." అని గోల పెట్టింది. ఇవేవీ పట్టించుకోకుండా ప్రభుదాసు మాత్రం తన అతిథిమర్యాదలు సాగిస్తూనే వచ్చాడు.



ఇంక ఇలా కాదని మనసులోనే ఒక పథకాన్ని ఆలోచించింది భద్రకాళి.

ఒకరోజున ప్రభుదాసు ఇంటికి ఇద్దరు యాత్రికులు వచ్చారు. వాళ్ళు దేశంలోని పుణ్యతీర్థాలు చూస్తూ యాత్రలు చేస్తున్నవాళ్ళు కావడంచేత... వాళ్ళంటే ఎంతో గౌరవం కలిగింది ప్రభుదాసుకి. వారికి మర్యాదలు చేసి ఇంట్లో కూర్చోపెట్టి, మంచి పిండివంటలకు కావలసిన వస్తువులను కొనుక్కువస్తానని బయటకు వెళ్లాడు ప్రభుదాసు.

తన పథకాన్ని అమలుజేయడానికి ఇదే మంచి సమయమని భావించిన భద్రకాళి-వాళ్ళు చూస్తుండగా రోట్లో బియ్యాన్ని దంచుతూ వెక్కివెక్కి ఏడవసాగింది.

భద్రకాళి ప్రవర్తన చూసి నివ్వెరపోయారు ఆ యాత్రికులు కొంచెంసేపు. ఆ తర్వాత "అమ్మా... మీరేదో దుఃఖంలో ఉన్నట్టున్నారు. కారణమేమిటో చెప్తారా?" అని మర్యాదగా అడిగారు.

"ఏం చెప్పమంటారు బాబూ..! మీవంటి ఉత్తముల ముందు అబద్ధం చెప్తే పాపం. నిజం చెప్తే నా మగనికి కోపం. ఏం చేయాలో తోచక ఏడుస్తున్నాను" అంది భద్రకాళి విచారాన్ని నటిస్తూ.

ఆ మాటలు విన్న యాత్రికులకి మతిపోయినంత పనయింది. 'సంగతేమిటో చెప్ప'మని బలవంతపెట్టారు.

"సర్లెండి బాబూ! నా మగనికి కోపమొచ్చినా సరే, మీవంటి పుణ్యాత్ముల ముందు నిజమే చెప్తాను. నా భర్త మీరనుకుంటున్నటువంటి ఉత్తముడు కాడు. ఒకప్పుడు మంచివాడేకాని, ఈమధ్య ఆయనకెవరో దుర్బోధ చేశారు. యాత్రలు చేస్తున్న పుణ్యపురుషుల తలలు ఈ రోకలితో బద్దలుకొట్టి అమ్మవారికి నైవేద్యం పెట్తే అష్ట ఐశ్వర్యాలూ సిద్ధిస్తాయని ఆ గురువెవరో చెప్పారుట. ఇప్పుడు ఆయన పూజాద్రవ్యాలు తేవటానికి బయటకువెళ్లారు. రాగానే ఈ రోకలితో మీ తలలు పగులకొట్టారు. నా మాట విని వెంటనే పారిపొండి" అంది.

ఆ మాటలు విని 'బ్రతుకు జీవుడా...' అంటూ బయటపడి వెనక్కి తిరిగి చూడకుండా పారిపోసాగారు ఆ యాత్రికులు.

కొంచెంసేపట్లో ప్రభుదాసు సరుకులతో ఇంటికి తిరిగివచ్చాడు. యాత్రికులు కనపడకపోయేసరికి వాళ్ళు ఎక్కడికి పోయారని అడిగాడు భద్రకాళిని.

"వాళ్ళేమి అతిథులండీ!వెర్రివాళ్ళులా ఉన్నారు. నేను బియ్యం దంచుతుంటే వెర్రిచూపులు చూస్తూ ఈ రోకలి తమ కిమ్మని అడిగారు. నేను ఇయ్యననేసరికి కోపం వచ్చి వెళ్లిపోయారు. వెళ్లి ఎంతోసేపు కాలేదు" అంది.

ఆ మాటలు విని ప్రభుదాసుకు కోపం వచ్చింది.

"ఓసి దౌర్భాగ్యురాలా! అతిథిదేవుళ్ళు వచ్చి వెధవ రోకలి కావాలంటే ఇయ్యకపోయావా! అదిస్తే నీ సొమ్మేం పోయిందే..?" అని, 'ఆ రోకలిని నేనే ఇస్తా'నని చెప్పి దానిని పుచ్చుకొని, వాళ్ళు వెళ్లిన దిశగా పరుగెత్తుకుంటూ వెళ్లసాగాడు.

కొంచెంసేపటికి ఆ యాత్రికులు కనబడ్డారు. వాళ్ళని చూడగానే ప్రభుదాసు "ఆగండి... ఇదుగో, మీరడిగిన రోకలి!" అంటూ అరుస్తూ, రోకలిని వారివైపు చూపిస్తూ పరుగెత్తుతూ వెళ్లసాగాడు.

ఆ మాటలు విని యాత్రికులు వెనక్కి తిరిగి చూశారు. చేతిలో రోకలితో తమవైపు పరుగెత్తుకు వస్తున్న ప్రభుదాసు కనిపించాడు. అతను తమను చంపడానికే వస్తున్నాడనుకుని పిక్కబలంకొద్దీ పారిపోయారు వాళ్ళు.

వాళ్ళను అందుకోలేక చేసేదిలేక తిరిగి వచ్చాడు ప్రభుదాసు. ఈ సంగతి ఆనోటా ఈనోటాపడి ప్రభుదాసు ఇంటికి అతిథులు రావడం తగ్గిపోయింది. కొంతకాలానికి నిజం సంగతి అతనికి తెలిసింది. ముందువెనకలు ఆలోచించకుండా తాను దానాలు చేయటంవల్లనే... తన తప్పు తెలియజెప్పడానికే భద్రకాళి ఇలా చేసిందని అర్థం చేసుకున్నాడు. ఇలా దానాలు చేస్తూ పోతే ఎంత ఆస్తి అయినా కరిగిపోతుందనే నిజం కళ్ళు తెరిపించింది. అప్పటినుంచి పరిమితంగా దానాలు చేస్తూ వచ్చాడు ప్రభుదాసు.

★★★

